ఫార్మాసిటీలోనే ఫార్మా విలేజ్?

- లగచర్ల, జహీరాబాద్‌లో వ్యతిరేకతతో సర్కారు వెనక్కి
- ముచ్చర్లలో అన్నీ సిద్ధంగా ఉండటంతో అక్కడే ఏర్పాటు

హైదరాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ): ఫార్మా విలేజ్‌ల ప్రతిపాదనపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఫార్మా అనగానే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో పునరాలోచనలో పడింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల ప్రాంతంలో సిద్ధం చేసిన ఫార్మాసిటీలోనే జనరల్ ఇంజినీరింగ్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని, అనంతరం అక్కడే ఫార్మా విలేజ్‌ను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు పారిశ్రామిక వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఫార్మాసిటీకి బదులుగా రాష్ట్రం నలువైపులా 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్ సర్కారు.. తొలుత వికారాబాద్, జహీరాబాద్ ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేసేందుకు నోటిఫికేషన్ జారీచేసిన విషయం విదితమే. కానీ, ఆ జిల్లాలోని లగచర్లలో ఫార్మా విలేజ్ భూసేకరణపై ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవడంతో రావడంతో ప్రభుత్వం వెనక్కు తగ్గింది. అక్కడ ఫార్మా విలేజ్ స్థానంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. జహీరాబాద్‌లో సైతం ఫార్మా విలేజ్ పట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో అక్కడ లగచర్ల రైతుల తిరుగుబాటు తరహా ఘటనలు తలెత్తకుండా చూసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. భూసేకరణ కోసం బలప్రయోగానికి దిగితే అక్కడ కూడా ప్రజలు తిరగబడే అవకాశం ఉన్నదని ప్రభుత్వానికి నివేదించినట్టు సమాచారం. దీంతో ప్రజావ్యతిరేకతను మరింత పెంచుకోవడం కంటే ఉన్న అవకాశాలను వినియోగించుకోవడమే ఉత్తమమని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

తొలుత కాలుష్యం లేని పరిశ్రమలకు అనుమతి

ఫార్మాసిటీ స్థానంలో జనరల్ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేసేందుకు టీజీఐఐసీ ఇప్పటికే లేఅవుట్‌ను కూడా సిద్ధం చేసింది. అక్కడ ముందుగా ఫార్మా పరిశ్రమలను కాకుండా సాధారణ పరిశ్రమలతోపాటు కాలుష్యానికి ఆస్కారం లేని ఔషధ కంపెనీలను అనుమతించాలని నిశ్చయించినట్టు తెలిసింది. ఔషధ పరిశ్రమలో ఫార్ములేషన్లు, బల్క్‌డ్రగ్స్ తయారీ విభాగాలు ఎంతో కీలకమైనవి. ఇవి కాలుష్యాన్ని సృష్టించేవి కావడంతో తొలుత రసాయనాల శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, ఆ తర్వాతే ఔషధ పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్టు సమాచారం. ఇలా చేస్తే రద్దయిన ఫార్మాసిటీ మళ్లీ మనుగడలోకి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు.

గోల్డ్ ర్యాలీకి బ్రేక్?

వచ్చే ఏడాది ధరల పెరుగుదల అంతంతే

ట్రంప్ రాకతో వాణిజ్య యుద్ధాలు.. వృద్ధిరేటు, డిమాండ్ పతనం: డబ్ల్యూజీసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: ఈ ఏడాది జోరుగా పెరిగిన బంగారం ధరలు.. వచ్చే ఏడాదిలో మాత్రం నెమ్మదించవచ్చని చెప్తున్నది ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ). మునుపెన్నడూ లేనివిధంగా దేశంలో పసిడి ధర ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆల్‌టైమ్ హైకి చేరిన విషయం తెలిసిందే. తులం 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) పుత్తడి రేటు గరిష్ఠంగా రూ.82,400 పలికింది. అయితే అక్టోబర్ ఆఖరుదాకా పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. గత నెలన్నర (45 రోజులు)గా పడుతూ.. లేస్తూ.. సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డబ్ల్యూజీసీ తాజా అంచనాలు సైతం ప్రస్తుత మార్కెట్ తీరుకు అనుగుణంగానే ఉన్నాయి. కొత్త ఏడాదిలోనూ మార్కెట్ ట్రెండ్ ఇదే రీతిలో ఉండవచ్చన్న అభిప్రాయాన్ని 2025 ఔట్‌లుక్‌లో వ్యక్తం చేసింది.

30 శాతానికిపైగానే..

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు 30 శాతానికి పైగా పుంజుకున్నాయి. సెంట్రల్ బ్యాంకులు, ముఖ్యంగా పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా బంగారం కొనుగోళ్లకు పెద్దపీట వేసింది. ఆర్బీఐ సైతం గోల్డ్ రిజర్వులకు అత్యంత ప్రాధాన్యాన్నిస్తున్న సంగతి విదితమే. అలాగే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధానం వంటివి స్టాక్ మార్కెట్లను కుంగదీశాయి. ఫలితంగా మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం ప్రత్యామ్నాయ మార్గమైన పసిడి వైపు చూశారు. దీంతో ఈ ఏడాది గోల్డ్ మార్కెట్‌లో డిమాండ్ ఊహించనివిధంగా పెరిగిపోయింది. ఇది ధరలను పరుగులు పెట్టించింది. మరోవైపు పండుగ సీజన్లు, పెండ్లిళ్ల సీజన్ కొనుగోళ్లు కూడా కలిసొచ్చాయి.

ఇదీ సంగతి..

బంగారం ధరలు వచ్చే ఏడాది ఈ స్థాయిలో పెరగకపోవచ్చని డబ్ల్యూజీసీ తాజాగా పేర్కొన్నది. జీడీపీ వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు గోల్డ్ మార్కెట్ క్రయ విక్రయాలను ప్రభావితం చేయవచ్చని అంటున్నది. జనవరిలో అమెరికాకు రాబోయే నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు వాణిజ్య యుద్ధాలకు తెర లేపవచ్చన్న ఆందోళనల్ని కనబర్చింది మరి. పరస్పర సుంకాలతో మదుపరులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు దూరం కావచ్చని, దీంతో ఆయా దేశాల జీడీపీ, విపణిలో డిమాండ్ పడిపోవచ్చని హెచ్చరించడం గమనార్హం. కానీ ఇప్పటికైతే బంగారం ధరలు అంతర్జాతీయంగా గరిష్ఠ స్థాయిల్లోనే కదలాడుతున్నాయి. ఔన్స్ 2,700 డాలర్ల సమీపంలో ఉన్నది. ఇక గోల్డ్‌మన్ సాచ్స్ గ్రూప్ వచ్చే ఏడాది ఆఖర్లో 3,000 డాలర్లకు పోవచ్చంటున్నది. యూబీఎస్ ఏజీ అంచనా 2,900 డాలర్లుగా ఉన్నది.

మరో రూ.1,000 డౌన్

బంగారం ధరలు శనివారం మరింత తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.980 దిగి రూ.77,890గా నమోదైంది. 22 క్యారెట్ రూ.900 పడిపోయి రూ.71,400 పలికింది. మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడమే కారణమని వ్యాపారులు చెప్తున్నారు. కాగా, శుక్రవారం కూడా ధరలు బాగా తగ్గిన విషయం తెలిసిందే. ఢిల్లీలో ఒక్క రోజే 24 క్యారెట్ తులం రూ.1,400 క్షీణించింది. ఇక వెండి కిలో ధర ఏకంగా రూ.4,200 పతనమై రూ.92,800 వద్దకు పరిమితమైంది. ఈ ఏడాది కిలో ధర లక్షా 2 వేల రూపాయల ఆల్‌టైమ్ హైని తాకినది తెలిసిందే.

రైతులపై అడ్వాన్స్ బాదుడు!

- సెస్ పరిధిలో 16 నెలల మొత్తం ఒకేసారి చెల్లించాలని హుకుం
- 3 హెచ్‌పీని 5 హెచ్‌పీగా మార్చి వసూలు
- సెస్ తీరుపై రైతుల మండిపాటు



బిల్లు చూపుతున్న రైతు లాల లింగయ్య,

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: కేసీఆర్ ప్రభుత్వంలో పండుగలా సాగు చేసుకున్న రైతు.. కాంగ్రెస్ ఏడాది పాలనలో అరిగోస పడుతున్నడు. ఇప్పటికే 60 శాతానికి పైగా రైతులు రుణమాఫీ కాక, రైతుబంధు రాక ఆగమవుతుండగా, సర్కారు మరో భారం మోపుతున్నది. సెస్ పరిధిలో 'అడ్వాన్స్' పేరిట ఒకేసారి రుసుము చెల్లించాలని హుకుం జారీచేసింది. మరోవైపు త్రీ హెచ్‌పీని ఫైవ్ హెచ్‌పీగా మార్చి రూ. 2,800 వరకు వసూలు చేస్తున్నది. ఇలా అయితే ఎవుసం ఎలా చేయాలని రైతులు నిలదీస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం పోతిరెడ్డిపల్లిలో మొత్తం 157 శాంక్షన్ అయిన మోటర్లు ఉన్నాయి. ఇవి సెస్ పరిధిలో ఉన్నాయి. గతంలో ఆరు నెలలకు ఒక్కో మోటర్‌కు రూ.185 చొప్పున బిల్లు చెల్లించేవారు. కానీ, ప్రస్తుతం అధికారులు 'అడ్వాన్స్' పేరిట రైతులపై భారం మోపుతున్నారు. 2024 మే నుంచి 2025 మే వరకు 12 నెలలతోపాటు గతంలో వసూలు చేయని నాలుగు నెలలు కలిపి మొత్తం రూ.480 చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నారు. అవసరైతే మొదటి వాయిదా కింద రూ.300, రెండో వాయిదా రూ. 180 చెల్లించాలని సూచిస్తున్నారు. ఇప్పటికే వసూలు కూడా ప్రారంభించారు. మరోవైపు త్రీ హెచ్‌పీ కనెక్షన్లను ఫైవ్ హెచ్‌పీగా అప్‌గ్రేడ్ చేస్తూ ఒక్కో మోటర్‌కు రూ. 2,800 వరకు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అందులో కొన్ని మోటర్లు త్రీ హెచ్‌పీగా ఉన్నా ఫైవ్ హెచ్‌పీగా మార్చి బిల్లు వసూలు చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

ఎవుసం జేసుడు ఎట్లా?

నాకు ఓ దగ్గర ఎకరంన్నర భూమి ఉంటే ఆడ బోర్ మోటర్ పెట్టిన. పదిహేనేండ్ల సంది అక్కడ పంటనే ఏత్తలేను. అయినా ఆరునెల్లకోసారి రూ.185 కడుతున్న. ఇప్పుడు దానిని ఫైవ్ హెచ్‌పీ కనెక్షన్ కింద మార్చి రూ.2,720 వసూలు చేసిన్రు. బాయిలకాడ మోటర్లకు వేలకు వేలు వసూలు సేత్తున్నరు.

–లాల లింగయ్య, రైతు (పోతిరెడ్డిపల్లి)

మోటర్ మార్చకున్నా ఎక్కువ ఎందుకు కట్టాలె

నాకున్న ఎకురంన్నర భూమిని ఎన్నో ఏండ్ల సంది బీడువెట్టిన. అయినా అక్కడున్న త్రీ హెచ్‌పీ మోటర్‌కు 6నెలలకు ఓసారి రూ.185 కట్టెటోన్ని. ఇప్పుడు పంటలు ఏస్తున్న. అదే త్రీ హెచ్‌పీ మోటర్ వాడుతున్న. కానీ, ఇప్పుడు అడ్వాన్సుగా రూ.480 కట్టమంటున్రు. నేను త్రీ హెచ్‌పీ మోటర్ మార్చకున్నా ఫైవ్ హెచ్‌పీ కింద మార్చిన్రు. ఇంకో రూ.2700 కట్టాలని సెస్ ఆఫీసోళ్లు అంటున్నరు. ఇప్పటికే రైతుబంధురాక పెట్టిబడికి పైసల్లేక ఇబ్బంది పడుతున్నం. కరెంటు బిల్లులు ఇష్టమొచ్చినట్టు వసూలు చేస్తే వ్యవసాయం ఎట్ల జేస్తం?

-గన్నమనేని లక్ష్మణ్‌రావు, రైతు (పోతిరెడ్డిపల్లి)

పెట్టుబడుల వరద

డాటా సెంటర్లలోకి రెండేండ్లలో 100 బిలియన్ డాలర్లు: సీబీఆర్‌ఈ

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: పెట్టుబడులను ఆకర్శించడంలో డాటా సెంటర్లు దూసుకుపోతున్నాయి. 2027 నాటికి డాటా సెంటర్ల విభాగంలోకి 100 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నదని సీబీఆర్‌ఈ అంచనావేస్తున్నది. అలాగే డాటా సెంటర్ల కెపాసిటీ 2070 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. ప్రస్తుతం 1,255 మెగావాట్ల స్థాయిలో ఉన్న డాటా సెంటర్ల సామర్థ్యం..ఈ ఏడాది చివరినాటికి 1,600 మెగావాట్లకు చేరుకుంటుందని తెలిపింది. గడిచిన ఆరేండ్లలో 60 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్శించిన దేశీయ డాటా సెంటర్ల విభాగం..వచ్చే మూడేండ్లలో 100 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని సీబీఆర్‌ఈ సౌత్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం 19 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో డాటా సెంటర్లు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరినాటికి ఇది 31 మిలియన్ చదరపు అడుగులకు చేరుకునే అవకాశం ఉన్నదని పేర్కొంది. అలాగే 475 మెగావాట్ల డాటా సెంటర్లు నిర్మాణ దశలో ఉన్నాయని, వచ్చే కొన్ని నెలల్లో ఇవి అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపింది. బీఎఫ్‌ఎస్‌ఐ, టెక్నాలజీ, టెలికం రంగాల నుంచి డాటా సెంటర్లకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

అంతర్జాతీయ సంస్థలు కూడా..

దేశీయ డాటా సెంటర్లలోకి అంతర్జాతీయ సంస్థలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. వీటితోపాటు రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు కూడా భారీగా నిధులుచొప్పించడానికి సిద్ధమవుతున్నాయి. డాటా సెంటర్ల నిర్వహణలో ముంబై తొలిస్థానం నిలిచింది. ఆ తర్వాతి క్రమంలో చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులు ఉన్నాయి.

రాష్ట్రంలో 400 జీసీసీల ఏర్పాటే లక్ష్యం

రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ): రానున్న రోజుల్లో రాష్ట్రంలో 400 గ్లోబల్ కెపబులిటీ సెంటర్లు(జీసీసీ) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 220కి పైగా జీసీసీలు ఉండగా, సమీప భవిష్యత్తులో వీటిని రెండింతలు పెంచడం ద్వారా బెంగళూరును అధిగమించాలని సంకల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. 'టెక్‌వేవ్' హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన అత్యాధునిక జీడీసీను శనివారం శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిజిటల్ రంగంలో సాధికారిత సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి ఇది ఎంతో దోహదపడుతున్నదన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందుకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు, ఇందులో టెక్‌వేవ్ ఏర్పాటు చేసిన జీడీసీ కీలకపాత్ర పోషించనున్నదన్నారు. టెక్‌వేవ్‌కు హైదరాబాద్ కార్యాలయంలో ప్రస్తుతం 2,400 మంది ఉద్యోగులు, అలాగే ఖమ్మంలో మరో 500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తాజాగా లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో మరో 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని టెక్‌వేవ్ సహ వ్యవస్థాపకులు, చైర్మన్ జీ దామోదర్ రావు తెలిపారు.

భూషణ్ స్టీల్‌కు భారీ ఊరట

న్యూఢిల్లీ, డిసెంబర్ 14: జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన భూషణ్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు భారీ ఊరట లభించింది. సుప్రీం ఆదేశాలకు అనుగుణంగా ఈడీ జప్తు చేసిన రూ.4,025 కోట్ల విలువైన ఆస్తులను పునరుద్ధరించింది. కార్పొరేట్ ఇన్సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రకారం దివాలా-ఐబీసీ కింద దివాల తీసిన కంపెనీ ఆస్తులను జేఎస్‌డబ్ల్యూ సరైన పరిష్కారం చూపించడంతో ఈడీ ఈ నిర్ణయం తీసుకున్నది. భూషణ్ స్టీల్‌కు చెందిన ఈ ఆస్తులను పీఎంఎల్‌ఏ చట్ట ప్రకారం గతంలో ఈడీ జప్తు చేసింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ సూచనల మేరకు ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది.

కనగర్తిలో ఆదిమ మానవుల ఆనవాళ్లు

- చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి



చెరువు పక్కన గుట్ట పై గుర్తించిన గ్రూవ్స్

ఓదెల, డిసెంబర్ 14: కనగర్తిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని శిలలపైన నవీన శిలాయుగానికి చెందిన చారిత్రక ఆధారాలను చరిత్ర పరిశోధకుడు, డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి శనివారం గుర్తించారు. మానేరు వాగు పొడువునా నవీన శిలాయుగగానికి చెందిన ఆదిమ మానవుల ఆధారాలను గుర్తిస్తూ వస్తున్నట్లు పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ క్రమంలో కనగర్తిలో ఈ చారిత్రక ఆధారాలను గుర్తించినట్లు తెలిపారు. 12వేల సంవత్సరాల నుంచి సామాన్య పూర్వ సంవత్సరం రెండు వేల సంవత్సరాల మధ్య కాలంలో నవీన శిలా యుగం ఆదిమ మానవులు జీవించారని తెలిపారు. వీరు ఎక్కువగా రాతి పనిముట్లు తయారు చేసుకుని తమ జీవనాన్ని కొనసాగించారని వివరించారు. రాతి పనిముట్లతోనే వ్యవసాయం సాగు చేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రాతి పనిముట్లు తయారు చేసుకునే గ్రామంలో శిలల పైన గ్రూవ్స్ ఏర్పడ్డాయి. దానకుంట చెరువు పక్కన గుట్టల పైన 9గ్రూవ్స్ గుర్తించినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు తమ గ్రామ పాధాన్యతను తెలిపేందుకు ఈ చారిత్రక ఆధారాలు దోహదపడతాయన్నారు. చారిత్రక ఆధారాలను గ్రామస్తులు పరిరక్షించుకోవాలని పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి తెలిపారు.

మీ సమస్య పరిష్కారానికి మీరే జడ్జి..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డీ. హేమంత్‌కుమార్
- లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 3033 కేసుల పరిష్కారం

పెద్దపల్లి కమాన్ : మాట్లాడుతున్న జడ్జి హేమంత్ కుమార్

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 14 : మీ సమస్యల పరిష్కారానికి మీరే న్యాయ నిర్ణేతలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి. హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం రంగంపల్లిలోని జిల్లా ప్రధాన న్యాయస్థానంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన హాజరయ్యారు. పలు కేసులను పరిష్కరించి, కక్షిదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇతరులపై తప్పుడు కేసులు పెటొట్టదని, ఒకసారి తప్పుడు కేసు పెడితే అది పరిష్కారమయ్యే దాకా అబద్ధపు సాక్ష్యాలను సృష్టించాల్సి వస్తుందన్నారు. కక్షిదారులందరికి న్యాయం చేయాలన్నదే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రజలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను చెల్లించి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని అన్నారు. బ్యాంకు అధికారులతో సామరస్యంగా చర్చించి వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోవాలన్నారు. భార్యాభర్తల గొడవల్లో ఇతర కుటుంబసభ్యులుపై తప్పుడు కేసులు పెట్టి వారిని ఇబ్బందులకు గురి చేయొద్దని జడ్జి సూచించారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3033 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి బీ శ్రీనివాసులు, జూనియర్ సివిల్ జడ్జి ఎన్. మంజుల, ప్రభుత్వ న్యాయవాది డీవీఎస్ మూర్తి, న్యాయవాదులు, అధికారులు, పోలీసు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, డిసెంబర్ 14: లోక్ అదాలత్‌తో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమం లో సెకండ్ క్లాస్ స్పెషల్ మేజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పెగడ శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏజేపీ దూడం ఆంజనేయులు, సీఐ సుబ్బారెడ్డి, న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజం, మాడూరి ఆంజనేయులు, ఆకారపు సర్వోత్తంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 14: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం సాధ్యపడుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి జీవన్ సూరజ్‌సింగ్, మున్సిఫ్ మేజిస్ట్రేట్లు నల్లాల వెంకట సచిన్ రెడ్డి, వెంకటేశ్ దుర్వ అన్నారు. శనివారం గోదావరిఖని ఆదనపు జిల్లా, సీనియర్ సివిల్ జడ్జి, మున్సిఫ్ కోర్టులలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వారు మాట్లాడారు. అనంతరం లోక్ అదాలత్‌లో వివిధ కేసుల్లో రాజీ కుదిర్చారు. ఇక్కడ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహెద ఫర్వీన్, లోక్ అదాలత్ సభ్యులు రాగిణి, అంజలి, పద్మజ, సంపత్, శ్యామ్, సంతోశ్, భానుకృష్ణ, భూమయ్య ఉన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 14: మండలంలోని 15 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరు కాగా, ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం పంపిణీ చేశారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వకీల్, డీటీ శంకర్, ఆర్‌ఐలు అజీమ్, రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఓదెల, డిసెంబర్ 14: ఓదెలలోని రైతు వేదికలో మండలంలోని 72మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే విజయ రమణరావు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

సుల్తానాబాద్, డిసెంబర్ 14 : పట్టణంలోని 4,5 వార్డుల్లో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమతకృష్ణ, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కథల పుస్తకాల ఆవిష్కరణ

ధర్మారం, డిసెంబర్17: విద్యార్థులు రచించిన కథలు, కవితల పుస్తకాలను ధర్మారంలోని సాధన జూనియర్ కళాశాలలో ఏఎస్‌ఐ మహ్మద్ సాబీర్ శనివారం ఆవిష్కరించారు. నరసింహులపల్లి జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి గడ్డం అభిలాశ్ రచించిన మణిపూసల శతకం, సాధన జూనియర్ కళాశాల విద్యార్థి పోడేటి సమజ్ఞ రచించిన గురువు మాట - ఆట వెలది శతకం, జగిత్యాల మైనార్టీ కళాశాలలో విద్యార్థి అస్మిన్ రచించిన అక్కచెల్లెళ్లు- పిల్లల కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల రచనలను పుస్తక రూపంలో తెచ్చిన నర్సింహులపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గాజ నవేణి కుమార్, పద్య సమీక్షకుడు తిప్పారపు లక్ష్మీ నర్సయ్య చార్యులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 14 : ప్రభుత్వ ఉపాధ్యాయుల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కే రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ మహాసభల్లో భాగంగా శనివారం పెద్దపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రావిడెంట్ ఫండ్ ఇస్తామని, డీఏ బకాయిలు చెల్లిస్తామని, పీఆర్‌సీ అమలు చేస్తామని, సీపీఎస్ రద్దు చేయడంతో పాటు పెండింగ్ బిల్లులన్నింటి చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంపెల్లి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గద్దె శ్రీనివాస్, కోశాధికారిగా గట్టు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా కుమారస్వామి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడిగా తిరుపతి ఎన్నికయ్యారు. ఇక్కడ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్కొండ శ్రీధర్‌తో పాటు పలువురు సంఘం నాయకులు న్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ధర్మారం, డిసెంబర్ 14: కానంపల్లికి చెందిన మహారాజు సౌమ్యకు ఎన్‌ఆర్‌ఐ కొలుముల దామోదర్ యాదవ్ ఆర్థిక సాయం అందించారు.గత నెల 15న ప్రమాదవశాత్తు సౌమ్య ఇల్లు కాలిపోయింది. ఆమెకు కుటుంబ పరిస్థితిని స్థానిక నాయకులు దామోదర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి సాయం అందించాలని కోరగా ఆయన స్పందించారు. రూ. 5వేలు పంపించగా, ఆ డబ్బులను శనివారం బాధితురాలికి దామోదర్ యాదవ్ ఫౌండేషన్ ఇన్చార్జి వేల్పుల నాగరాజు, రజక సంఘం మండల అధ్యక్షుడు గుడి కందుల ఎల్లయ్య అందజేశారు. దామోదర్ యాదవ్‌కు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

సుల్తానాబాద్ కోర్టుకు వాటర్ ఫ్రిడ్జ్ వితరణ

సుల్తానాబాద్, డిసెంబర్14 : సుల్తానాబాద్ కోర్టు కక్షి దారులకు తాగు నీటి సౌకర్యం కల్పించేందుకు భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుల్తానాబాద్ శాఖ అందించిన నూతన వాటర్ ఫ్రిడ్జ్‌ను శనివారం జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో వాటర్ ఫ్రిడ్జ్ ఏర్పాటుకు సహకరించిన ఎస్‌బీఐ మేనేజర్ మహేష్‌చంద్ర, ఎస్‌బీఐ ప్యానల్ అడ్వకేట్ ఆవుల లక్ష్మీరాజంలను జడ్జి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు వొడ్నాల రవీందర్, పడాల శ్రీరాములు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, ఎస్‌బిఐ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న విప్ అడ్లూరి

ధర్మారం, డిసెంబర్14: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మానవత్వం చాటుకున్నారు. పెర్కపల్లికి చెందిన ధనిశెట్టి అస్మిత, ఆమె తల్లి యశోద శనివారం ధర్మారానికి కేం ద్రానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వెళ్తుండగా బంజేరుపల్లి వద్ద ఇన్నోవా వాహనం ఓవర్ టేక్ చేయడంతో ప్రమాదవశాత్తు తల్లీకూతురు కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. అదే సమయంలో ఆ దారి గుండా వెళ్తున్న విప్ అడ్లూరి తన వాహనాన్ని ఆపి బాధితులను తన పోలీస్ ఎస్కార్ట్ వాహనంలో చికిత్స కోసం కరీంనగర్‌కు పంపించారు.

ఎల్వోసీ అందజేత

ముత్తారం, డిసెంబర్ 14: ఓడేడు గ్రామానికి చెందిన అల్లాడి సంపత్ రావుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రూ.2.50 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి సహాయకుడు సంపత్ రావు కుటుంబ సభ్యులకు ఎల్వోసీ అందజేశారు. వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50లక్షలు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సంపత్ రావు, అతని కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్కారం

సుల్తానాబాద్, డిసెంబర్ 14 : రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన సిలివేరి మహేందర్‌ను శనివారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలు క్రీడా సంఘాల బాధ్యులతో పాటు డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ సత్కరించారు. మహేందర్‌కు చోటు దక్కడం సుల్తానాబాద్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జీ జనార్దన్‌రెడ్డి వేణుగోపాల్, అంతటి శంకరయ్య, కనకం సమ్మయ్య, వంగపల్లి సూర్యప్రకాశ్ ఉన్నారు.

సింగరేణి మహిళలకు ఆటల పోటీలు

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 14: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శనివారం స్థానిక కమ్యూనిటీ హాలులో మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 23న జరిగే ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్, కమ్యూనికేషన్ సెల్ కో-ఆర్డినేటర్ దేవారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

రామగిరి డిసెంబర్ 14 : పన్నూర్ గ్రామానికి చెందిన గొల్లపల్లి మధు (45) మూడు రోజులు క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు పిల్లలు లేరని కలత చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని భార్య తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రామగిరి ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.

పట్టుపట్టారు..కొలువు కొట్టారు



భోగం ముక్తేశ్వర్

చిందం వినయ్

సల్పాల సురేందర్

ముత్తారం, డిసెంబర్ 14: పోలీసు కావాలన్నది వారి ఆశయం. ఆ పోలీసు ఉద్యోగం కోసం ఎన్నో కలలు కన్నారు. నెలల తరబడి ఇంటికి దూరంగా ఉంటూ శిక్షణ తీసుకున్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించే దాకా పట్టు వీడలేదు. చివరికి వారు అనుకున్న కల నెరవేరింది చివరికి బీఎస్‌ఎఫ్ లో కొలువు సాధించారు. మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన భోగం ముక్తేశ్వర్, చిందం వినయ్, అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన సల్పాల సురేందర్ ముగ్గురు యువకులు డిగ్రీ చేశారు. గత మార్చిలో బీఎస్‌ఎఫ్ అర్హత పరీక్షలు రాశారు. శుక్రవారం ఫలితాలు విడుదలైన ఉత్తీర్ణులయ్యారు. పోలీసు కావాలనే వారి లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. వారి తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. కొలువు సాధించిన ముగ్గురు యువకులను, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

ధరలకు అనుగుణంగా వేతన సవరణ జీవో విడుదల చేయాలి

గోదావరిఖని, డిసెంబర్ 14: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతన చట్టం సవరణతో జీవో విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ హయాంలో నిర్ణయించిన కనీస వేతనాలు ఇప్పటివరకు సవరణ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాదిలో కనీస వేతన చైర్మన్‌ను మాత్రమే నియమించి సభ్యులను నియమించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కనీసవేతనాలను సవరించి, 75 షెడ్యూల్డ్ రంగాలకు సంబంధించిన జీవోలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడుదల చేయాలని కోరారు. కనీస వేతన బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా చేసి కేవలం ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీలను మాత్రమే నియమించడం కార్మికులకు అన్యాయం చేయడమేనని, ఇది అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, ప్రధానకార్యదర్శి బీ అశోక్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, జిల్లా నాయకులు మల్యాల దుర్గయ్య, ఎడ్ల రవికుమార్ పాల్గొన్నారు.